ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet
Edition
గురువారం 29 జనవరి 2026 www.prajaswaramdaily.com 2 PM

# బీఆర్ఎస్ నన్ను సస్పెండ్ చేయలేదు


### వారి యాక్షన్ బట్టే నా రియాక్షన్
### : ఎమ్మెల్యే దానం నాగేందర్



హైదరాబాద్, ప్రజాస్వరం
బీఆర్ఎస్ నన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేయలేదు. వాళ్లు తీసుకునే యాక్షన్ బట్టి నా రియాక్షన్ ఉంటుంది. ఎన్నికలంటే నేనేమీ భయపడను'' అని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యానించారు. అనర్హత వ్యవహారంలో స్పీకర్ నోటీసులపై స్పందించారు. నోటీసులకు వివరణ ఇస్తూ తమ అడ్వకేట్ లేఖ రాశారని.. ఆయన నుంచి జవాబు రాలేదని చెప్పారు. గురువారం మీడియాతో దానం నాగేందర్ మాట్లాడారు. ''విచారణకు వ్యక్తిగతంగా హాజరుకావాలని నాకు చెప్పలేదు. మా అడ్వకేట్ స్పీకర్‌కు లేఖలో ఏం రాశారో తెలియదు.

# కేసీఆర్‌కు నోటీసులు

### ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో కీలక పరిణామం
### నందినగర్ లోని ఆయన ఇంటికి వెళ్లిన సిట్ అధికారులు.. నోటీసులు అందజేత
### ఇప్పటికే కేటీఆర్, హరీశ్ రావు, సంతోష్ రావులను విచారించిన సిట్



హైదరాబాద్,ప్రజాస్వరం

తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు పుట్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నందినగర్ లోని కే సీఆ ర్ ఇంటికి వెళ్లి సిట్ అధికారులు నో టీసులు ఇచ్చారు. రేపు మధ్యాహ్నం 3 గంటలకు విచారిస్తామని తెలిపారు. ఇబ్బంది లేకుంటే జూబ్లీహిల్స్ పీఎస్ కు విచారణకు రావొచ్చని సూచించారు. పీఎస్కు రానట్లయితే హైదరాబాద్లో అనువైన ప్రదేశం సూచించాలని సిట్ అధికారులు తెలిపారు.65 ఏళ్లు పైబడిన వ్యక్తులకు పీఎస్ విచారణకు పిలవకూడదనే నిబంధన ఉంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, హరీశ్ రావు, సంతోష్ రావు లు సిట్ విచారణకు హాజరైన సంగతి తెలిసిందే.

**ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావులను పలుమార్లు విచారించగా, తమ వాంగ్మూలంలో 'పైనుంచి వచ్చిన ఆదేశాల మేరకే ఫోన్లు ట్యాపింగ్ చేశామని' స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈ క్రమంలోనే సిట్ అధికారులు ఆ 'పైస్థాయి వ్యక్తి' ఎవరనే కోణంలో విచారణను వేగవంతం చేశారు.**



# 'తెలంగాణ రైజింగ్'లో భాగస్వాములు కండి

### హార్వర్డ్ బిజినెస్ స్కూల్ విద్యార్థులతో సీఎం రేవంత్

హైదరాబాద్, ప్రజాస్వరం
'తెలంగాణ రైజింగ్'లో భాగస్వాములు కావాలని విద్యార్థులను సీఎం రేవంత్ కోరారు. హైదరాబాద్, తెలంగాణలో అవకాశాలు, బలాలను ప్రపంచానికి చెప్పాలన్నారు. హైదరాబాద్ ఇమేజ్‌ను చాటే బ్రాండ్ అంబాసిడర్లుగా ఉండాలని సీఎం కోరారు.అమెరికాలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన కొనసాగుతోంది. విద్యార్థుల ఆహ్వానం మేరకు హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌కు వెళ్లిన సీఎం.. అక్కడి విద్యార్థులతో మాటామంతి నిర్వహించారు. వివిధ అంశాలపై వారితో చర్చించారు.

# భారత్ రీఫార్మ్ ఎక్స్‌ప్రెస్‌లో ముందుకెళ్తోంది

### మనం టెక్నాలజీతో పోటీపడతాం
### దానిని అందిపుచ్చుకుంటాం
### దాని సామర్థ్యాన్ని అంగీకరిస్తాం
### అది మనుషులను భర్తీ చేయలేదు
### పార్లమెంట్ వద్ద మీడియాతో ప్రధాని మోదీ
### ఐరోపా సమాఖ్య తో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందంపై ప్రస్తావన



న్యూఢిల్లీ, ప్రజాస్వరం
ప్రస్తుతం భారత్ రీఫార్మ్ ఎక్స్‌ప్రెస్‌లో ముందుకెళ్తోందని, ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తోందని ప్రధాని మోదీ చెప్పారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం ఆయన పార్లమెంట్ వద్ద మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఐరోపా సమాఖ్య తో కుదిరిన స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం గురించి ప్రస్తావించారు. అది శుభసూచికమన్నారు. . అలాగే సాంకేతికత మనుషులకు ప్రత్యామ్నాయం కాదని మోదీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించిందన్నారు. . ప్రపంచానికి భారత్ ఆశాకిరణం అని అన్నారు. అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా భారత్ దూసుకెళ్తోందని తెలిపారు. వికసిత్ భారత్ కోసం ఎంపీలు కృషి చేయాలన్నారు. పెండింగ్ సమస్యలకు పరిష్కారాలు లభిస్తుండటంతో భారత్‌ను సుస్థిరదేశంగా ప్రపంచం చూస్తోందన్నారు. ట్రేడ్‌డీల్‌తో కొత్త మార్కెట్ అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. వాటినుంచి తయారీదారులు లబ్ధి పొందాలని కోరుతున్నానని తెలిపారు. ఈయూలోని 27 దేశాలకు నాణ్యమైన ఉత్పత్తులు అందించాలని పేర్కొన్నారు. ''మనం టెక్నాలజీతో పోటీపడతాం. దానిని అందిపుచ్చుకుంటాం. దాని సామర్థ్యాన్ని అంగీకరిస్తాం. అయితే అది మనుషులను భర్తీ చేయలేదు అని అన్నారు.

# అజిత్ పవార్ కు కన్నీటి వీడ్కోలు

### ముగిసిన అంత్యక్రియలు
### కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, డిప్యూటీ సీఎం ఏక్నాథ్ శిందే, రాజకీయ ప్రముఖులు హాజరు



ముంబయి, ప్రజాస్వరం
మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ఎన్సీపీ కార్యకర్తలు, అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. విమాన ప్రమాదంలో చనిపోయిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియలు ముగిశాయి. గురువారం బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ప్రభుత్వ లాంఛనాలతో అజిత్ కు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ , డిప్యూటీ సీఎం ఏక్ నాథ్ శిందే, ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ , తదితర రాజకీయ ప్రముఖులు అంతక్రియల్లో పాల్గొన్నారు. అజిత్ పవార్ ను కడసారి చూసేందుకు ఎన్సీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున మైదానానికి వచ్చి పార్టీ అధినేతకు కన్నీటి వీడ్కోలు పలికారు.
బుధవారం ఉదయం బారామతి విమానాశ్రయం సమీపంలో జరిగిన ప్రమాదంలో అజిత్ పవార్ దుర్మరణం చెందిన సంగతి తెలిసిందే. విమానం రన్ వేపై దిగేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో కుప్పకూలి మంటల్లో చిక్కుకుంది. దీంతో అజిత్ పవార్ తో పాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం నిమిత్తం బారామతికి వస్తుండగా ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. పవార్ కు భార్య సునేత్ర పవార్ (రాజ్యసభ సభ్యురాలు), ఇద్దరు కుమారులు పార్థ్, జే ఉన్నారు.

# లక్ష్మీనారసింహుడికే ..నామం

యాద్రాద్రి, ప్రజాస్వరం



యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. ప్రచార శాఖలో విక్రయించే బంగారం, వెండి.. రూ.10 లక్షల విలువైన డాలర్లు మాయం అయ్యాయి. ఈ వ్యవహారం అధికారుల ఆడిట్ లో బయటపడింది.

# తిరుమల శ్రీవారి ఆలయం వద్ద అపచారం



తిరుమల, ప్రజాస్వరం
తిరుమల శ్రీవారి ఆలయం వద్ద అపచారం జరిగింది. ఆలయ పరిసరాల్లో అసభ్యకరంగా ఓ కొత్త జంట ఫోటో షూట్ చేసింది. తిరుమలలో ఫోటో షూట్లు, రీల్స్ చేయడంపై నిషేధం ఉన్నప్పటికీ భద్రతా సిబ్బంది పట్టించుకోకపోవడంపై భక్తుల నుంచి పెద్దఎత్తున విమర్శలు వస్తున్నాయి.

# వన దేవతలను దర్శనం చేసుకున్న కేంద్ర మంత్రులు

మేడారం ,ప్రజాస్వరం
కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరం మేడారం సమ్మక్క–సారలమ్మ దర్శనం చేసుకున్నారు. మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ దివాకర డోలు–డప్పులతో ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో పూజారులు, అధికారులు కేంద్ర మంత్రులకు దర్శనం చేయించారు.



# కొలంబియాలో ఘోర విమాన ప్రమాదం

### 15 మంది మృతి
### మృతుల్లో ఆ దేశ శాసనసభ్యుడు



కొలంబియా, ప్రజాస్వరం
కొలంబియాలో ఘోర విమాన ప్రమాదం.. 15 మంది మృతి చెందారు. ప్రమాదంలో ఆ దేశ శాసనసభ్యుడు డియోజెనెస్ క్వింటెరో, అభ్యర్థి కార్లోస్ సాల్సెడో సహా 15 మంది మరణించారు. సటేనా ఎయిర్‌లైన్స్‌కు చెందిన బీచ్‌క్రాఫ్ట్ 1900 విమానం కుకుటా నుంచి బయలుదేరింది. వెనిజులా సరిహద్దు సమీపంలోని మారుమూల పర్వత ప్రాంతంలో కూలింది. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో సంబంధం కోల్పోయిన ఈ విమానంలోని ప్రయాణికులందరూ మృతి చెందినట్లు అధికారులు ధృవీకరించారు.